# గుంయి గుంయి గురివి

శిష్ట్లా ఉమామహేశ్వర రావు

ఈ కత నా ముక్య చేహితురాలు గురివిది!

గురివిని గుంయి గుంయి గురివి అని అంటాం!

ఎందుకంటామో చెప్పడానికే ఈ కతలో మతం. గురివి వర్సుల్లో సేరింది యుద్దం మొదలెట్టగానే. ట్రయినింగు కాంగానే దాన్ని డిశ్చార్జి చేశారు. ఎందుకంటే ఎప్పుడూ దాని సెవుల్లో గుంయి గుంయి మంటుందని కంప్లేంటు సేసేది. ఓసారి ఓ అపరేషన్ చేత్తుంటే అదేందో పళ్ళెం పట్టుకుని డాక్టరు పక్క మంచుని మంచుని సెవులో గుంయి గుంయి మంటున్నదని ఆ పళ్ళెం అక్కడే పడేసి పోయిందంట.

మర్నాడే డిశ్చార్జి.

నిజానికి దాని మొగం, అది నమత్తాడింది పద్దాలుగోయేట. అప్పట్నుంచీ దానికి సెవులో గుంయి గుంయి మంటూండేది. అదెవరికి తెలీలేదు.

గురివికి కూడా అప్పడే తెలీలేదు.

ఓసారి ఓ క్యాప్టెను సెలవు తీసుకుని బెంగుళూరు పార్కులో గురివితో చేహం సేశాడు. ఇద్దరూ ఓ బల్లమీద కూకున్నారట. 'కబుర్లు సెప్పకుందాం?' అన్నాట్ట క్యాప్టెను.

'గుబులుగా ఉందా!' అన్నట్టు వినబడి 'వద్దు' అందిట గురివి.

రెండోచాన్స్ ఇవ్వకుండా అదేపోత పోయాడు క్యాప్టెను.

అప్పుడు తెలుసుకుంది గురివి సెవులో గుంయి గుంయి రోగం ఉందని. అయితేనేం మిలిటరీ ఉద్యోగం చేద్దామని బాగావుంది దానికి.

మిలిటరీ చేరింది, డిశ్చార్జి అయింది.

పందొమ్మిదేళ్ళుంటాయి. నిత్యం ఆ గుంయి గుంయి అంటూ నీరశించిపోతున్నది పిల్ల. చివరకన్నాను నేను, 'పిల్లా! ఎందుకు కష్టపడతావు– యవ్వనం వృదాసేసు కుంటావ్? ఏం లాబం! క్యాప్టెన్లూ లెప్టెనెంట్లూ నీవొంకే చూత్తున్నారని అనుకోడమే గాని అది నీ గుంయి గుంయి వల్ల వచ్చిన వృదా ఆలోచన్లే. ఆలోచించు నువ్వే' నచేనని ఓరోజు ఓ డాక్టేరుకు సెవి సూపింది. ఆయన 'సేరు సేరు పేను పొడరుంది పాతర్లేసినట్టుగా నీ సెవ్వులో!' అని బుస్సుబుస్సుమని పైకొచ్చేట్టుగా నురుగులు తీశాడు. పైగా తాగడానికేందో మందిచ్చి పంపాడు. ఆ మందును సూసి దాని చిన్నతమ్ముడు సంతోసించాడే గాని దానికి రోగం కుదర్లా.

ఇట్లాగే ఎంతోమంది డాక్టర్లసేత పడ్డది. రోగం మాత్రం కుదర్లేదు.

'మళ్ళీ మిలిటరీ సేరుతా?' అని వూనాపోయింది గురివి.

నేను నా బటాలియన్‌తో సికింద్రాబాదు పోయాను.

ఓనాడు బజారెళ్తున్నా. ముందొక సోల్జరుగాడితో సెయ్యీ సెయ్యీ పట్టుకుని గురివి పోతున్నది. సివిలుబట్టలే కట్టింది. పారిపోయొచ్చిందేమో అనుకున్నా. వెంటబడ్డా.

దాని జిమ్మతియ్యా! ఇద్దరూ సందులూ గొందులూ దాటారు. యే సావులో కెళ్ళినా యనక్కి తిరిగి సూడదు. చివరకు ఓ టీ సావులోకెళ్ళారు. టప్పాకొయ్యా అక్కడ కూడా వెన్నులు గేటువేపే పెట్టి కూకున్నారు. సరే! నేగూడా టీకని లోపలికిపోయాను. నిజమే గురివే, ఆపక్కోడు సోల్జరుగాడే ఎవరో! నాగజెముదు పండల్లే ముక్కూ, గొంగలి వురుగల్లే మీసం!


'ఏమోయి అగ్గురారబ్బడితా! ఇక్కడున్నావా?' అంటూ నా బల్ల దగ్గిరకొచ్చింది.

'నువ్వేం పారిపోయి రాలేదు గందా?' అని అడిగాను.

'ఛీ లేదోయి' అంటూ ఆ సోల్జెరేవు సూసి 'డార్లింగ్ పిక పిక్! మై ఫ్రెండ్ అగ్గురారబ్బడితాయ్!' అని నన్ను సూపింది.

'అగ్గుర్ వాట్? అగ్గుర్ అగ్గుర్ వాట్? వైటే మినిట!' అంటూ ఆ బొల్లి ముండాకొడుకు లేచి వెళ్ళిపోయాడు. పోతూ 'అగ్గుర్, అగ్గుర్! గాడ్! డాం ఇట్!' అనుకున్నాడు.

'నా పేరంటే ఆడికంత కష్టమా! నా దేశం ఎందుకొచ్చాడూ?' అనుకున్నాను నేను.






డార్లింగనేమాట నాకూ తెలుసు! 'డార్లింగు! మరి నువిక్కడికెందుకొచ్చావు? సివిలు గుడ్డల్లో వున్నావేం?' అని అడిగాను.

'పారిపోయి రాలేదోయి. ఆ గుంయి గుంయి పోలేదు. దాంతో మాట్రబుల్‌గా వుంది. మళ్లీ డిస్చార్జి సేసారు. వత్తూంటే ఓ కొత్తగా సేరిన లెఫ్టినెంటుతో గుసగుసలాడుతూ ఖూ వూరొచ్చా!'

'ఆయనకూ నీకూ యవారం ఏంలేదు గందా!'

'ఛీ ఛీ యవారాలు పెట్టుకొనేదాన్నో కాదో నీకు తెలీదూ'

'నిజమే తెలుసు. అయితే యీ తెల్లమొగాన్నెక్కడ పట్టావు?'

ఈ వూళ్ళో నాల్రోజులున్న తర్వాత 'డార్లింగ్ నా సెలవైపోయింది నేపోతా' అని ఆ లెఫ్టినెంటు పోయాడు. అనాడిక్కడ పార్కులో అటూ ఇటూ తిరుగుతున్నా. 'కూయి కూయి' అంటూ ఈడొచ్చాడు. ఈలవేశాడు. నాకర్థం కాలేదు. 'డార్లింగ్ వాటీజ్ యువర్ నేమ్' అన్నాడు. 'మిస్ గురివి' అన్నాను. 'డార్లింగ్ గుర్ గుర్' అన్నాడు. ఇద్దరం నవ్వాం. అక్కడే బెంచిమీద కూకున్నాం. 'డార్లింగ్ టీ' అన్నాడు. 'అల్‌రైటు' అన్నాను. బజారొచ్చాం. ఓ పౌంటెన్ పెన్‌కొని ప్రెజంటు సేశాడు. అడ్నుంచి ఓ సందులో ఇల్లుంటే పోయాం. కాసేపు కూకున్నాం. 'డార్లింగ్ నీ జాకెట్ కొలత తీసుకోనీ. గుడ్డకొని మిషన్ వాడికిద్దాం' అన్నాడు. 'అల్‌రైట్' అన్నాను.

కొలత కొలిచాడు. లేచాం, గుడ్డలకొట్లోకెళ్ళాం. జాకెట్ గుడ్డ కొన్నాం. మిషినోడి దగ్గరకుపోయాం. ఆడు నన్ను కొలుచుకుంటానన్నాడు. 'ఏంటి?' అని తెల్లోడడిగాడు. 'నన్ను కొలుచుకుంటాట్ట' అన్నాను. 'పళ్ళు రాలకొడతాను అని చెప్పు- ఇదిగో కొలత' అన్నాడు. కొలత ఇచ్చాం. సరాసరి టీకొచ్చాం. అక్కడ నువ్వు కనబడ్డావ్. ఇందులో తప్పేంటి సెప్పు'

'నువ్వు సేసేదాన్లో తప్పేంటుందా డార్లింగ్?' అన్నాను. 'మరేంటి! ఏంసేద్దాం! ఎక్కడికెల్దాం?' అని అడిగాను.

'అరెరే' అన్నది గురివి.

'ఏంటి ఏంటి?' అని అడిగాను.

'ఛీ ఛీ! ఇప్పుడేనా ఇట్లా అవడం!' అన్నది.

'ఏంటి ఎట్లా అయింది?' అని అడిగాను.

'సెప్పడానికి సిగ్గవుతుందోయి' అన్నది.

'నీకు సిగ్గేంటి గురివీ!' అన్నాను.

'సెప్పతానుండు. మరే...!' అని ఊరుకున్నది.

'సెప్పు సెప్పు దాచుకోకు!' అన్నాను.

'దాచుకుంటే ఎట్లా జరుగుతుంది! సెపుతా' అన్నది.

'జాకెట్ లోపల బాడీ బనీను పగిలింది డార్లింగ్' అన్నది.

'ఇంతేనా! సైజుచెప్పి ఓ అరడజన్ తీసుకుందాం పదా!' అన్నాను.

పోయాం ఓ సావులోకి. సావు కుర్రాడికి సెప్పాం ఏం కావాలో.

'మీ సైజెంత మేడం?' అన్నాడు కుర్రాడు.

'నాకు 32 సైజు కావాలి' అన్నాను.

'నా ఉద్దేశం మేడంకు 36 సైజు కావాలనుకుంటాను' అన్నాడు.

'నో! నాకు 32 సైజే కావాలి' అంది గురివి.

'నో మేడంకు 36 సైజు ఫిట్' అన్నాడు కుర్రాడు.

'ఏంటి నీ మాటలు! నా సైజు నాకే తెలీదనుకుంటావా?' అంది గురివి.

'ఏడేండ్లనుంచీ బాడీ బనీన్లమ్ముతున్నా. ఏ మనిషి కేసైజో నాకు తెలీదనుకున్నావా?' అన్నాడు కుర్రాడు.

'నీ మాటలు పెడసరంగా ఉన్నాయి. అవి కట్టెట్టి నేనడిగిన సైజు నాకిచ్చి పంపించు. అన్‌డర్‌స్టాండ్?' అన్నది.

అంటూ నాతో అన్నది 'పద్దాలుగేండ్ల ఈడు నుంచి సైజు 32 తొడుక్కుంటున్నా. ఇప్పుడిరవైయ్యేగా నా యీడు!'

'అల్‌రైటు! నాకేం ఇష్టాను. అయితే 36 సైజువాళ్ళు 32 సైజు వేసుకుంటే చెవులల్లో గుంయి గుంయి మంటుంది. తెలీదూ?' అన్నాడు షావు కుర్రాడు.